'ఇందిరా' జల వికాసం.. గిరిజనులకు వరం

- కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేస్తాం
- అచ్చంపేట నియోజకవర్గంలో రైతులందరికీ సోలార్ పంపుసెట్లు
- శాంతి భద్రతలు, పన్నుల వసూళ్లలో తెలంగాణ నెంబర్ వన్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని ప్రారంభిస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"తెలంగాణ ప్రజల ఆశీస్సులతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తున్నాం అభివృద్ధి విషయంలో మంత్రివర్గం ఎంతో కృషి చేస్తోంది.. ఇప్పుడు ప్రారంభించుకుంటున్న ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం గిరిజనులకు వరంలాంటిది.. ఆడబిడ్డల ఆర్థిక పురోభివృద్ధి కోసం పాటుపడుతున్నాం.. రాబోయే రోజుల్లో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యం.. ఒక ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడి ఎదిగితే ఆ కుటుంబం, ఆ ప్రాంతం ఎదుగుతుంది" అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. గిరిజనుల అభ్యున్నతికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇందిరా సౌరగిరి జల వికాసం పథకాన్ని సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ ప్రాంతంలోని మాచారంలో సీఎం ప్రారంభించారు.

హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో మాచారం చేరుకున్న ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజాప్రతినిధులకు కలెక్టర్ బాదావత్ సంతోష్, ఉన్నతాధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సీఎం, మంత్రులు సీతారామాంజనేయ స్వామి ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. ఆ తర్వాత మాచారంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఇందిరా సౌరగిరి జల వికాసం పథకం పైలాన్‌ను ప్రారంభించారు. గిరిజనుల కోసం రూ.12,600 కోట్లకు సంబంధించిన నల్లమల డిక్లరేషన్‌ను మంత్రులతో కలిసి సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ.. ఒకప్పుడు నల్లమల అంటే ఎంతో వెనుకబడిన ప్రాంతమని, ప్రస్తుతం ప్రజల ఆశీస్సులతో ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రిగా వచ్చి అభివృద్ధి చేస్తున్నానని అన్నారు. అప్పట్లో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణను గెలిపించాలని ఎన్నికల సమయంలో తాను కోరగా యాభైవేల పైచిలుకు మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించారని.. తాను నల్లమల బిడ్డగా చెప్పుకోవడానికి గర్వంగా ఉందని అన్నారు. అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వంశీకృష్ణకు ఎంత బాధ్యత ఉందో..ఈ ప్రాంత బిడ్డగా తనకూ అంతే ఉందని చెప్పారు. నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచించాలని, నిధులు విడుదల చేయాలని మంత్రులను కోరారు. గిరిజనులు ఆత్మగౌరవంతో ఉండే విధంగా ఇందిరా సౌరగిరి జలవికాసం పథకం చేపట్టినట్టు తెలిపారు. ఈ రోజు చెంచు ఆడపడుచులతో మాట్లాడానని, అలివేలు అనే మహిళ తోటల పెంపకం గురించి చెబుతుంటే ఆనందంగా ఉందన్నారు. అలాగే సోలార్ విద్యుత్తుపై అవగాహన కల్పించడంతోపాటు ఇళ్లకు, వ్యవసాయ అవసరాలకు సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సిందిగా జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలో రైతులందరికీ సోలార్ పంపుసెట్లను రాబోయే వంద రోజుల్లో ఉచితంగా అందజేస్తామని చెప్పారు. ఈ విషయంలో అచ్చంపేట ప్రపంచానికి, దేశానికి ఆదర్శంగా ఉంటుందన్నారు. పాలమూరు జిల్లా వారికి పాలన చేతకాదని అవహేళన చేసే వారికి.. తాము తట్ట, పార పనితోపాటు పరిపాలన కూడా చేస్తామని ఏడాదిన్నరలో నిరూపించామన్నారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటున్నామని సిఎం వివరించారు. అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని చెప్పారని, కానీ తమ ప్రభుత్వంలో సన్నరకం వడ్లను పండిస్తే రూ.500 బోనస్ కూడా ఇస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన సన్నవడ్లను తిరిగి రేషన్ ద్వారా ప్రజలకు సన్న బియ్యంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా మూడు కోట్ల పది లక్షల మందికి సన్న బియ్యం అందిస్తున్నామని, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. అలాగే, పొదుపు సంఘాల సభ్యులకు ఆర్టీసీ బస్సులను ఇచ్చి వాటికి వారిని యజమానులను చేసిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఒకప్పుడు సోలార్ అంటే అదాని, అంబానీలకే అనుకునే వారని, ప్రస్తుతం తాము ఆడబిడ్డలకు, గిరిజన పుత్రులకు సైతం అందిస్తున్నామని తెలిపారు. ఆడబిడ్డలకు పెట్రోల్ బంకులు కూడా కేటాయించి వారే స్వయంగా నడిపే విధంగా చేశామన్నారు. ఆడబిడ్డలకు హైదరాబాద్ శిల్పారామం పక్కన స్థలం కేటాయించి వారి ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేశామన్నారు. అంబానీ, అదానీలతో పోటీపడేలా ఆడబిడ్డలకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు.

తాము వచ్చిన మొదటి సంవత్సరంలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రయివేట్ రంగాల్లోనూ ఉద్యోగ అవకాశాలు కల్పించినట్టు వివరించారు. 12 యూనివర్సిటీల్లో వైస్‌చాన్స్‌లర్లను నియమించామన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేషన్ స్కూళ్లను ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌కు ప్రపంచ దిగ్గజ కంపెనీలను తీసుకొస్తున్నామని, ఈ విషయంలో తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. శాంతిభద్రతల విషయంలోనూ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచినట్టు కేంద్రం ప్రకటించిందన్నారు. పన్నుల వసూళ్లలోనూ నెంబర్ వన్ రాష్ట్రంగా ఉందని వివరించారు. అప్పట్లో భూమి, భుక్తి కోసం పోరాటాలు, స్వేచ్ఛ కోసం పోరాటాలు జరిగాయని, వాటిని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ముఖ్యమంత్రి తెలిపారు. పేదలకు 25 లక్షల ఎకరాల భూములను అందించి పేదలకు ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత తమకే దక్కుతుందన్నారు.

ఇందిరాగాంధీలా ఉండాలి..

ప్రధానమంత్రి ఎలా ఉండాలంటే ఇందిరాగాంధీలా ఉండాలని పహల్గాం ఘటనతో ప్రతి ఒక్కరికీ తెలిసి వచ్చిందని సిఎం అన్నారు. ప్రతి పేదవారి గుండెల్లో తండాల్లో, గూడేల్లో ఇందిరాగాంధీ ఉన్నారని తెలిపారు. అందువల్లే ఈ పథకానికి ఇందిరా సోలార్ వికాసం పథకంగా పేరు పెట్టినట్టు చెప్పారు. అనంతరం అచ్చంపేట నియోజకవర్గంలో స్వయం సహాయక బృందాలకు రూ.119 కోట్ల చెక్కులు అందజేశారు. తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఎంపీ మల్లురవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలవాలి

- ఐదు డీఏలు చెల్లించాలి.. రిటైర్డ్ బెనిఫిట్స్ ఇవ్వాలి
- త్వరలో అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కలుస్తాం
- తెలంగాణ ఎంప్లాయీస్ కోఆర్డినేషన్ కమిటీ నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించేలా సిఎం రేవంత్‌రెడ్డి ముందడుగు వేయాలని తెలంగాణ ఎంప్లాయీస్ కో ఆర్డినేషన్ కమిటీ కోరింది. ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు త్వరలో అన్ని పార్టీల అధ్యక్షులను కలిసి మద్దతు కోరుతామని ప్రకటించింది. ఐదు పెండింగ్ డీఏలను చెల్లించాలనీ, పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేసింది. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్‌ను వెంటనే ఇవ్వాలని విన్నవించింది. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆ కమిటీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. అందులో టిఎన్‌జిఓ సంఘం మాజీ నేతలు, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మెన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్సీ పి.సుధాకర్‌రెడ్డి, దేవీప్రసాద్, విఠల్, భుజంగరావు, హమీద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పరిపాలనా ఖర్చులన్నీ ఉద్యోగుల జీతభత్యాలతో చూపెట్టడం సరిగాదన్నారు. కోసుకున్నా తనదగ్గర పైసా లేదన్నట్టుగా సిఎం మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. గతంలోనూ ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఉద్యోగులపై ఇలాగే మాట్లాడి అబాసుపాలైన విషయాన్ని గుర్తుచేశారు. ఉద్యోగుల పరిష్కారం కోసం వేసిన మంత్రుల, నవీన్‌మిట్టల్ కమిటీలతో ఒరిగిందేమీ లేదనీ, వాటిపేరుతో కాలయాపన చేయాలని రాష్ట్ర సర్కారు చూస్తున్నదని విమర్శించారు. రిటైర్డ్ బెనిఫిట్స్ రాక మూడు లక్షల మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. హెల్త్‌కార్డు ద్వారా ప్రతి ఉద్యోగికి కూడా నగదురహిత చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. హోంగార్డులు, మోడల్ స్కూల్ రెగ్యులర్ టీచర్లకు ప్రతి నెలా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పెన్షనర్లకు చెందిన రూ. ఎనిమిది వేల కోట్ల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆరు డీఏలను రిలీజ్ చేసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఐదు డీఏలను విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి

- ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి
- ప్రభుత్వానికి ఎమ్మెల్సీ కోదండరామ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరామ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సీఆర్‌పీఎఫ్ తదితర సంఘాల ఆధ్వర్యంలో " ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీ... జులుంను అరికట్టాలి" అనే అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో అయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. పదేండ్లు రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల నియంత్రణపై ఎలాంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రజా సంఘాలు, వివిధ పార్టీల ఒత్తిడి మేరకు ఏర్పాటు చేసిన తిరుపతిరావు కమిటీ కేవలం కళాశాల ఫీజులపై కొన్ని సిఫారుసులు చేసిందని గుర్తు చేశారు. ప్రాథమిక స్థాయిలో ఇప్పటి వరకు ఫీజుల నియంత్రణపై ఎలాంటి విధివిధానాలు లేవని అన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో చర్చించి ఫీజు నియంత్రణకు కృషి చేస్తానని అన్నారు. ప్రయివేట్ విద్యాసంస్థల ఆదిపత్యాన్ని నిలువరించాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి సమావేశానికి విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ స్వీయ అనుభవాలను పంచుకున్నారు. ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఏటా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. ఫీజులకు తోడు పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, నోట్‌బుక్స్, టై, బ్యాడ్జీలు, స్పోర్ట్స్ డ్రస్‌లు తదితర సామాగ్రిని తమ వద్దే కొనాలని నిర్బంధం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టని పిల్లలను ఇంటికి పంపించడం, ఎండలో నిలబెట్టడం, తోటి పిల్లల ముందు అవమానపర్చడం లాంటి చర్యలు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రయివేట్ పాఠశాలలపై ప్రభుత్వం నియంత్రణా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదంని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, సిఆర్‌పిఎఫ్ కన్వీనర్ జి వేణుగోపాల్, కన్వర్ మదర్స్ అసోసియేషన్, కన్వీనర్ జి.భాగ్యలక్ష్మి, దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షులు పి శంకర్, హెచ్ఎస్‌పిఎ అధ్యక్షులు వెంకట్ సాయినాథ్, ఎన్‌పీసీఆర్ కో ఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టును ఆశ్రయించిన ఓఎంసి కేసు దోషులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓబులాపురం మైనింగ్ (ఓఎంసీ) కేసులో దోషులుగా ఉన్న నలుగురు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ మంత్రి గాలి జనార్ధనరెడ్డి, బీబీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్, అలీ ఖాన్ సోమవారం పిటిషన్లు దాఖలు చేశారు. తమను దోషులుగా తేల్చేందుకు సరైన ఆధారాలు లేవని పేర్కొన్నారు. ఇప్పటికే మూడున్నరేళ్లపాటు జైల్లో ఉన్నామని తెలిపారు. విచారణ సందర్భంగా గతంలో బెయిల్ మంజూరు చేసినప్పుడు ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదన్నారు. ఇప్పుడు బెయిల్ మంజూరు చేసినా నిబంధనలకు లోబడి ఉంటామని పిటిషనర్లు పేర్కొన్నారు. ఓఎంసి కేసులో ఈనెల 6న నాంపల్లిలోని సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. గాలి జనార్ధనరెడ్డితో పాటు బీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్, అలీఖాన్‌ను దోషులుగా తేల్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారంతా చంచల్‌గూడ జైల్లో ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు రూ.53.64 కోట్లు విడుదల

- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రారంభమైన 5,364 ఇందిరమ్మ ఇళ్లకు రూ. 53.64 కోట్లు విడుదల చేసినట్టు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా... పనులు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు ప్రతి సోమవారం నిధులను విడుదల చేస్తున్నట్టు తెలిపారు. బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న 1383 ఇళ్లకు, గోడలు పూర్తయిన 224 ఇళ్లకు సోమవారం 16.07 కోట్లు విడుదల చేశామన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి జూమ్ మీటింగ్ ద్వారా లబ్దిదారుల చెల్లింపులపై మంత్రి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి పైలట్ ప్రాజెక్ట్ కింద 47,335 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్టు తెలిపారు. ఇప్పటివరకు 20,104 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని, అందులో 5140 ఇండ్లు బేస్‌మెంట్, 300 ఇళ్లు గోడల నిర్మాణం వరకు మరో పది ఇళ్లు శ్లాబుల వరకు పూర్తయ్యాయని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమ చేస్తున్నామని తెలిపారు. బేస్‌మెంట్ పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు, గోడలు పూర్తయిన తర్వాత రూ. 1.25 లక్షలు, శ్లాబ్ పూర్తి చేసుకున్న తర్వాత రూ. 1.75 లక్షలు, ఇల్లు పూర్తయిన తర్వాత మిగిలిన లక్ష రూపాయలను విడుదల చేస్తామని వివరించారు. వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

'కిషన్ రెడ్డి గల్లీ లీడర్‌లా వ్యవహరించారు'

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పాతబస్తీ గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదంపై కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా కాకుండా గల్లీ లీడర్‌లా వ్యవహరించారంటూ మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అగ్ని ప్రమాద బాధితులను ఆదుకునేందుకు కిషన్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడాలి లేదా సీఎంను సంప్రదించాలి కానీ అక్కడికెళ్లి సర్కారుపై బురద జల్లారని విమర్శించారు. 'కిషన్‌రెడ్డి సర్కారుపై విమర్శలు చేయడం మానుకో... ప్రజలకు సర్వీస్ చేయడం నేర్చుకో' అని హెచ్చరించారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే సిఎం రేవంత్‌రెడ్డి జీఎంహెచ్‌సీ అధికారులను అప్రమత్తం చేశారని తెలిపారు. ఆ లోపే జరగాల్సిన ప్రాణ నష్టం జరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గుజరాత్‌లో వంతెన కూలి 140 మంది చనిపోయారని గుర్తు చేశారు. ఆ విషయంలో మోడీపై రాహుల్ గాంధీ విమర్శలు చేశారా? ప్రమాదాలు చెప్పిరావనీ అందరికీ తెలుసనన్నారు. హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి చేపట్టిన భారత్‌మాతా యాత్ర సందర్భంగా టపాసులు పేల్చడం వల్ల ఇద్దరు చనిపోయారని తెలిపారు. ప్రధాని మోడీ చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను ఆన్‌లైన్‌లో ప్రారంభించిన సందర్భంగా పెద్ద గాలి దుమారం రావడంతో రేకులు ఎగిరిపోయాయన్నారు. దీనికి కారణం ఎవరంటే కిషన్‌రెడ్డి ఏం చెబుతారని ఆయన ప్రశ్నించారు.

మరో నాలుగు రోజులు వర్షాలు

- చురుగ్గా నైరుతి రుతుపవనాలు
- వాతావరణ శాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళ, బుధ వారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది.

బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్నాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అసమానతల్లేని సమాజం కోసం పోరాడాలి

- దోపిడీ అంతం కావాలి
- అదే సుందరయ్యకిచ్చే నిజమైన నివాళి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- సుందరయ్య పార్క్‌లో సుందరయ్య విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసమానతల్లేని సమాజం కోసం పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. పేద, ధనికుల మధ్య తేడా, అంటరానితనం, స్త్రీ, పురుషుల మధ్య అసమానతల్లేకుండా సమాజం ఉండాలని సుందరయ్య భావించారని గుర్తు చేశారు. సుందరయ్య మార్గంలో పోరాటాలను ముందుకుతీసుకుపోవడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్‌లో సుందరయ్య 40వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సుందరయ్య విగ్రహానికి జాన్‌వెస్లీ సహా పలువురు నాయకులు, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఈ దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనీ, అందరికీ విద్యావైద్యం ఉచితంగా అందాలనీ, పేద, ధనిక వ్యత్యాసం లేకుండా ఉండాలని సుందరయ్య కోరుకున్నారని చెప్పారు. ప్రతి మనిషికీ పనిచేసే హక్కుండాలన్నారు. వాటికోసం ఆయన జీవితాంతం కృషి చేశారని అన్నారు. ఈ దేశంలో కొద్ది మంది చేతుల్లో సంపద పోగవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భూస్వాముల చేతుల్లో, కార్పొరేట్ సంస్థల చేతుల్లో సంపద ఉంటున్నదని వివరించారు. ఈ దేశంలో ఒక్క శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద, 10 శాతం సంపన్నుల చేతుల్లో 90 శాతం సంపద పోగయ్యిందని అన్నారు. అట్టడుగున ఉన్న 50 శాతం పేదల చేతుల్లో మూడు శాతం సంపద ఉందన్నారు. అందుకే దేశంలో పేదరికం, దరిద్రం ఉన్నదని చెప్పారు. ఈ భూమిపై అందరికీ సమాన హక్కు ఉంటుందనీ. భూపంపిణీ జరగాలని ఆయన ఆకాంక్షించారని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఆయన నాయకత్వం వహించారని గుర్తు చేశారు. బాంచన్ దొర నీ కాల్మొక్తా అన్న పేదల చేతులతో బందూకులు పట్టించి తిరుగుబాటు చేసి భూస్వాములు, రజాకార్లను తరిమికొట్టిన చరిత్ర ఉందని చెప్పారు. మూడు వేల గ్రామాలను విముక్తి చేసి ప్రజారాజ్యాలను ఏర్పాటు చేశారనీ, భూమిని పేదలకు పంచారని అన్నారు. వెట్టిచాకిరీని రద్దు చేశారని చెప్పారు. దేశంలో భూసంస్కరణల చట్టాన్ని సాధించారని వివరించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం స్ఫూర్తితో దేశంలోని ప్రజలంతా తిరుగుబాటు చేస్తారనీ, సోషలిస్టు వ్యవస్థ వస్తుందని ఆనాటి పాలకులు భావించారని అన్నారు. భారత సైన్యం, రజాకార్లు కలిసి తెలంగాణ సాయుధ పోరాటాన్ని అణచివేశారని చెప్పారు. ఈనాటికీ సుందరయ్య అందరికీ ఆదర్శమన్నారు. సామాజిక న్యాయం కోసం, వర్గదోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేశారని అన్నారు. ఆయన మార్గంలోనే సిపిఎం ప్రజల తరపున పోరాటాలను నిర్మిస్తుందన్నారు. దోపిడీ లేని సమాజం కోసం కృషి చేయాలని చెప్పారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్ మాట్లాడుతూ సుందరయ్య ఉన్నత విలువలతో బతికారని అన్నారు. పోరాటాలతో ప్రజల కోసం సేవా కార్యక్రమాలు కూడా చేశారని చెప్పారు. వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ అధ్యక్షులు పివి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నేతగా, సంఘసంస్కర్తగా, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సుందరయ్య పోరాటం చేశారని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా ఆయన భూమిని పేదలకు పంచారని గుర్తు చేశారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం దశరథ్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి ఆశయ్య, టి స్కైలాబ్‌బాబు, ఆర్ వెంకట్రాములు, వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ సుందరయ్య పార్క్ ప్రధాన కార్యదర్శి ఎస్ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వి కళ్యాణ్‌నాయక్, మాజీ అధ్యక్షులు నాగభూషణం, నాయకులు సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని అంబులెన్సుల్లో ఆక్సిజన్ సౌకర్యం

తప్పుడు ప్రచారం మానుకోండి ● డిహెచ్ డాక్టర్ రవీందర్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుల్జార్‌హౌజ్ అగ్నిప్రమాద బాధితులను ఆస్పత్రులకు తరలించిన అంబులెన్సుల్లో ఆక్సిజన్ సిలిండర్లు లేవంటూ జరుగుతున్న ప్రచారాన్ని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్ ఖండించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటన స్థలం నుంచి ఉదయం 6 గంటల 25 నిమిషాలకు అంబులెన్స్‌లో (నెంబర్ టీఎస్08యుఎల్ 5682) తొలి పేషెంట్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. మొత్తం ఎనిమిది అంబులెన్స్‌లు ఘటన స్థలానికి పంపించినట్టు స్పష్టం చేశారు. ఘటనా స్థలం నుంచి 15 మంది బాధితులను 108 అంబులెన్సుల్లో ఉస్మానియా, కేర్, అపోలో, యశోద ఆస్పత్రులకు తరలించినట్టు చెప్పారు. ప్రతి అంబులెన్స్‌లోనూ ఆక్సిజన్ సౌకర్యం ఉందని ఆయన వివరించారు. ఇలాంటి ఆపద సమయంలో రాజకీయ ప్రయోజనాల కోసం అనవసరమైన అపోహలు సృష్టించి, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది మనోధైర్యాన్ని దెబతీయొద్దని రవిందర్ నాయక్ విజ్ఞప్తి చేశారు. అగ్నిప్రమాద ఘటన గురించి తెలిసిన మరుక్షణమే అప్రమత్తమయినట్టు తెలిపారు. ఘటనా స్థలానికి డాక్టర్ల బృందాన్ని పంపించామని డీహెచ్ వెల్లడించారు. క్షతగాత్రులకు వైద్యం అందించేందుకు, స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేసి ఉస్మానియా హాస్పిటల్‌లో సిద్ధంగా ఉంచామని తెలిపారు. దురదృష్టవశాత్తు ప్రమాదంలో 17 మంది ప్రాణాలు కోల్పోయారని విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యుల పరిస్థితిని అర్థం చేసుకుని, వారికి మరింత అసౌకర్యం కలగకుండా వీలైనంత త్వరగా పోస్ట్‌మార్టమ్ ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొన్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సహా ఉన్నతాధికారులందరూ ఉదయమే ఉస్మానియా హాస్పిటల్‌కు చేరుకుని పరిస్థితిని సమీక్షించామని రవిందర్ నాయక్ తెలిపారు. అన్ని అంబులెన్స్‌లలో ఆక్సిజన్ ఉందనీ, తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

PUBLIC NOTICE

This is to inform the general public that M/s D&S Associates, a Partnership Firm was constituted under Indian partnership Act, 1932, on 30/05/2015 bearing Firm Registration no 2299 of 2015 with the Registrar of Firms, Ranga Reddy. Since there are no operations for the last several years, and the partnership is an At Will Partnership between Mr. Ponnekanti Dayachari as the Managing Partner and Mr. Agniparthi Sudeep as the other partner, the Managing Partner dissolved the said partnership firm w.e.f 10.04.2025 and has submitted the necessary Forms before the Registrar of Firms. As required by law, we are hereby informing the general public about the dissolution of the Firm by way of public Notice.

(SD) Dr Ponnekanti Dayachari
Managing Partner
M/s D&S Associates(Dissolved)
Contact Address: Plot no 105, Road no 72 (road no 18 internal) Prashasan Nagar, Jubliee hills, Hyderabad, 500033.

IN THE COURT OF THE XI ADDL. DISTRICT JUDGE, WEST GODAVARI DISTRICT, TADEPALLIGUDEM
I.A.NO.60/2024 IN CMANO.2/2024 AND CMA NO.2/2024

Between:
Sri Penmatsa Ravi Kumar ...Appellents/Petitioner
And
1.Smt.Penmatsa Leela
2.Smt.Satti @ Penmatsa Vineela ...Respondents/Respondents

2వ రెస్పాండెంటు/2వ ప్రతివాది :
శ్రీమతి సత్తి @ పెనుమత్స వినీల సూర్యనారాయణరాజు, డోరునెం.24-7/2, ఫ్లాటు నెం.502, ఎస్.ఆర్.నగర్, మెయిన్ రోడ్డు, అమీర్‌పేట, హైదరాబాద్-18, తెలంగాణ.

పై నెంబరు అప్పీలులో అప్పిలెంటు పిటీషనరు దాఖలు చేసిన తదుపరి ఎన్ని పర్యాయము 2వ రెస్పాండెంటు అయిన మీకు అప్పీలు నోటీసులు మరియు I.A.లో నోటీసులు పంపించియున్నప్పటికి తీసుకొనని కారణంగా శ్రీకోర్టు వారు 2వ రెస్పాండెంటు అయిన మీకు అప్పీలు నోటీసులు మరియు I.A నోటీసులు పేపరు పబ్లికేషన్ ద్వారా అమలు నిమిత్తం ఉత్తర్వులు యిచ్చియున్నారు. సదరు I.A మరియు అప్పీలు వాయిదా ది.**19-6-2025**వ సం॥రం తేది అయివున్నది. సదరు వాయిదా తేది ది.**19-06-2025**వ సం॥రం తేది ఉదయం గం.10.30 ని॥ల లగాయితూ మీరు స్వయముగా గాని లేక, న్యాయవాది ద్వారా గాని శ్రీకోర్టు వారి యెదుట హాజరు అయి ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షముగా తీర్మానించబడునని యీ ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

వాయిదా తేది: 19-6-2025
ముద్దన శ్రీనివాసరావు
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 9948337320

మోడీ వైఖరితో ప్రజాస్వామ్యం అపహాస్యం

- ఏకపక్షంగా విదేశాలకు పంపే ఎంపీల ఎంపిక జాబితా
- తానే అధికారపక్షం.. ప్రతిపక్షంలా మోడీ తీరు
- బీబీనగర్ ఎయిమ్స్‌పై కేంద్రం నిర్లక్ష్యం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు
- యాదాద్రి భువనగిరిలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహావిష్కరణ

సమావేశంలో మాట్లాడుతున్న బివి రాఘవులు

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

పహల్గాంలో ఉగ్రవాదుల దాడి, ఆపరేషన్ సిందూర్ ప్రక్రియ అనంతరం ఉగ్రవాదుల పట్ల భారతదేశ వైఖరి తెలిపేందుకు విదేశాలకు పార్లమెంట్ సభ్యులను పంపే విషయంలో ప్రధాని నరేంద్ర మోడీ వైఖరితో ప్రజాస్వామ్యం అపహాస్యమైందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, మాజీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రాఘవులు మాట్లాడుతూ.. ఉగ్రవాదం పట్ల భారతదేశం వైఖరిని ప్రపంచానికి తెలియజేసేందుకు విదేశాలకు పంపుతున్న ఎంపీల బృందంలో ప్రతిపక్ష పార్టీలు తమ జాబితా పంపినప్పటికీ.. పట్టించుకోకుండా ఆయా పార్టీల సభ్యులను సైతం తానే ఎంపిక చేయడం ప్రజాస్వామ్యాన్ని దుర్వినియోగం చేయడమేనని చెప్పారు. ఆయా పార్టీలు నిర్ణయించిన సభ్యులను కాదని కేంద్ర ప్రభుత్వం సొంతంగా పార్లమెంట్ సభ్యుల జాబితాను సిద్ధం చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు విలువలేదని, మోడీ ప్రభుత్వం తానే ప్రతిపక్షం, అధికార పక్షంలా వ్యవహరిస్తూ నిరంకుశ వైఖరిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల పార్లమెంట్ సభ్యుల ఎంపికను కాంగ్రెస్, తృణముల్ కాంగ్రెస్ తప్పు పట్టిన విషయాన్ని గుర్తు చేశారు. భారతదేశ వైఖరిని విదేశాలకు తెలియజేయడం ఒక భాగం అయితే.. మన భారతదేశంలో ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం లేదా? ప్రజలకు చెప్పకుండానే.. పార్లమెంట్‌లో ప్రస్తావించకుండానే విదేశాలకు పంపించడం విడ్డూరంగా ఉందన్నారు. పార్లమెంట్ సభ్యుల విదేశాలకు పంపించే సభ్యుల ఎంపిక మొత్తం వ్యవహారాన్ని చూస్తుంటే ప్రతిపక్షాల పట్ల, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల, రాజ్యాంగం పట్ల గౌరవం లేదని స్పష్టవుతోందన్నారు. ఈ విషయాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ గమనించాలన్నారు. కేంద్రం వైఖరిని ఎత్తిచూపాల్సిన అవసరముందని చెప్పారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికను మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న సిపిఎం

ఎన్నికలు అభివృద్ధికి ఆటంకంగా ఉన్నాయని, ఎన్నికలు జరిగితే విపరీతంగా ఖర్చు అవుతుందని.. అందుకే ఒకే దేశం ఒకే ఎన్నిక జరపాలని హైదరాబాద్‌లో నిర్వహించిన సదస్సులో కేంద్ర మంత్రులు పేర్కొనడం హాస్యాస్పదమని రాఘవులు అన్నారు. దేశంలో పార్లమెంట్ ఎన్నికలు ఏడు దశలుగా నిర్వహించారని, ఒకేసారి దేశమంతటా ఒకటే రోజు ఎందుకు నిర్వహించలేకపోయారని ప్రశ్నించారు. ఒక ప్రాంతంలో ఒకసారి నిర్వహించిన ఎన్నికల సామగ్రిని, పోలీస్ సిబ్బందిని మరొక ప్రాంతంలో మరొక దశలో ఉపయోగించుకుంటూ నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే ఎన్నికల పోలింగ్ బూతుల సంఖ్యను, ఎన్నికల ఎలక్ట్రానిక్ మిషన్స్, భద్రపరిచే గదులు, పోలీస్ వ్యవస్థను పెంచుకోవాల్సిన అవసరం లేదా? ఆ ఖర్చు పెరగదా, ఎన్నికలను ఖర్చుల పేరుతో చూడటం ప్రజాస్వామ్యంలో బాధాకరమన్నారు. ప్రజలు ఎన్నికల్లో ఏం చూసి ఓట్లు వేయాలనేది నిర్ణయించుకుంటారని, పార్లమెంట్ ఎన్నికల్లో, ఒక విధంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఒక విధంగా, ప్రాంతీయ ఎన్నికల్లో ఒక సమస్యను ఎంచుకొని ఓటర్ తమ తీర్పును తెలియజేస్తారని వివరించారు. ఒకే దేశం.. ఒకే ఎన్నికపై సిపిఎంగా మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నామని, ప్రజలందరూ బిజెపి విధానాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఎయిమ్స్‌పై కేంద్రం నిర్లక్ష్యం

స్థానికంగా ఉన్న ఎయిమ్స్ ఆస్పత్రి నిర్వహణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని రాఘవులు విమర్శించారు. ఎపిలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నడిచే మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రి రోగులకు సేవలందిస్తుంటే.. బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి వచ్చిన రోగులను గాంధీకి తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్రంలో ఉన్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏం మాట్లాడరు.. నిధులు కేటాయించరని విమర్శించారు. ఆస్పత్రిలో 750 మంచాలు ఉంటే.. 250 మంది పేషెంట్స్ మాత్రమే ఉన్నట్టు నిర్వాహకులు తెలిపారని అన్నారు. భవనం శిథిలావస్థకు చేరుకుందని, ఈ పరిస్థితి ఎందుకు ఉందని ప్రశ్నించారు. ఒకచోట ఒక విధంగా, మరోచోట ఒక విధంగా ఉండటం ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి మెరుగుపరచు కోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి పాండు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన చికిత్స

- అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ములుగు జిల్లా తాడ్వాయి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ విచారం వ్యక్తం చేశారు. ఘటనలో ఇద్దరు చనిపోయారని తెలిసి మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని మంత్రి ఆదివారం రాత్రి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

మునీర్ కుటుంబానికి అవసరమైన సాయమందించాలి

జర్నలిస్ట్ మునీర్ ఆరోగ్య పరిస్థితిపై వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. మునీర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిసి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మునీర్ గచ్చిబౌలిలోని ఒమెగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఒమెగా ఆస్పత్రి యాజమాన్యానికి మంత్రి సూచించారు. గతంలో మునీర్ సింగరేణిలో పనిచేసి వీఆర్ఎస్ తీసుకున్నారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ ఆయన చికిత్స ఖర్చులు భరిస్తోందని మునీర్ కుమారుడు మయూర్ తెలిపారు. మునీర్ కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉండాలనీ, వారికి అవసరమైన సహాయం అందించాలని ఈ సందర్భంగా మంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు.

బ్యాంకు ముందు రైతుల రాస్తారోకో

బ్యాంకు ముందు రాసారోకో చేస్తున్న రైతులు

- ధాన్యం కాంటాల ఆలస్యంపై ఆగ్రహం
- కొనుగోళ్లలో గోల్‌మాల్‌పై చర్యలు చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతోందని, అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంలోని కో ఆపరేటివ్ బ్యాంకు ఎదుట సోమవారం ధర్నా చేపట్టి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి, పడిగాపులు కాయాల్సి వస్తోందని పిఎసిఎస్ సిఇఒ మధుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సాపూర్, తూప్రాన్ ప్రధాన రహదారిపై బైఠాయించారు. నెలల తరబడి వడ్లను కాంటా వేయకపోవడంతో వర్షాలకు తడిసిపోయి నిత్యం కల్లాల వద్దనే గడపాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిర్వాహకులు కమీషన్లు తీసుకుంటున్నారే తప్ప, కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. నెలల తరబడి వడ్లను కాంటా వేయడం లేదని, కాంటా వేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తే అక్కడ తరుగు పేరుతో క్వింటాలుకు ఎనిమిది కిలోలు తీసేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల హమాలీ క్వింటాకు రూ.50 వసూలు చేస్తున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల వద్ద జరుగుతున్న గోల్‌మాల్‌పై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుకర్‌రెడ్డి వెంటనే ఘటన స్థలానికి చేరుకుని అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

పెద్దతూండ్లలో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండల కేంద్రమైన తాడిచెర్లలోని పెద్దతూండ్లలో రైతులు సోమవారం ఆందోళన చేశారు. ఒసిపి వద్ద తాడిచెర్ల పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలోకాంటాలు పెట్టడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు వస్తున్నా పట్టించుకోవడం లేదంటూ రైతులు కొనుగోలు కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.

కూకట్‌పల్లిలో అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కూకట్‌పల్లి పరిధి హైదర్‌నగర్‌లోని డైమండ్ ఎస్టేట్ లేఅవుట్‌ను ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఇక్కడ ప్లాట్లను కొనుగోలు చేసిన 79 మంది బాధితులకు న్యాయం చేసింది. గత సంవత్సరం సెప్టెంబర్‌లో 79 మంది బాధితులకు ఈ స్థలం చెందుతుందని హైకోర్టు తీర్పునిచ్చింది. అయినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయకపోవడంతో బాధితులంతా హైడ్రాకు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కూకట్‌పల్లి మండలం హైదర్‌నగర్ డివిజన్‌లోని సర్వే నెంబర్ 145లో 9 ఎకరాల 27 గుంటల స్థలంలో డైమండ్ ఎస్టేట్స్ లేఅవుట్ విస్తరించింది. ఇందులో మధ్యతరగతి ప్రజలు 79 మంది 2000 సంవత్సరంలో ప్లాట్లు కొనుగోలు చేశారు. అనంతరం ఆ స్థలం తనదని శివ దుర్గాప్రసాద్ అనే వ్యక్తి మరి కొంతమందితో కలిసి ఆక్రమణకు పాల్పడ్డాడు. అనంతరం ప్లాట్ల యజమానులను స్థలంలోకి రాకుండా హైకోర్టు నుంచి స్టే తీసుకువచ్చారు. దీంతో బాధితులందరూ కోర్టుకు వెళ్లి 2024 సెప్టెంబర్‌లో స్థలాలను దక్కించుకున్నారు. న్యాయస్థానం ప్లాట్ల యజమానులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా కబ్జాదారులు స్థలాన్ని ఖాళీ చేయలేదు. బాధితులను లేఅవుట్‌లోకి రాకుండా అడ్డుకున్నారు. దీంతో వారంతా హైడ్రాకు ప్రజావాణిలో గోడును వెలిబుచ్చారు. ఈక్రమంలో హైడ్రా సోమవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టింది. దీంతో ప్లాట్ల యజమానులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలి

- అవగాహన సదస్సులో సారంపల్లి

సదస్సులో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూభారతి చట్టం ప్రకారం అసైన్డ్ భూములు, ఇళ్ల స్థలాలకు హక్కులు కల్పించాలని ఎఐకెఎస్ సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. నల్లగొండ జిల్లా గట్టుప్పల మండల కేంద్రంలో సోమవారం రైతు సంఘం జిల్లా నాయకులు చాపల మారయ్య అధ్యక్షతన నిర్వహించిన "భూభారతి చట్టం"పై అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. సాదాబైనమాల దరఖాస్తులకు ఇచ్చిన గడువు డిసెంబర్ 2023 వరకు పొడిగించాలని, భూభారతి రూల్స్ ప్రకారం షెడ్యూలు బిలో చెప్పినట్టు వారసత్వ పట్టాలకు ఎలాంటి ఫీజులూ వసూలు చేయొద్దని అన్నారు. ఆ ఇళ్ల స్థలాలను పాత పట్టాదారులకే ఇవ్వాలని, ఇళ్ల నిర్మాణానికి ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం, జిల్లా నాయకులు చాపల మారయ్య, కర్నాటి మల్లేశం, సాగర్ల మల్లేష్, జెర్రిపోతుల ధనుంజయ, మిర్యాల భరత్, వరికుప్పల ముత్యాలు, కర్నాటి సుధాకర్, పగిళ్ల శ్రీనివాస్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో మౌలిక వసతులుంటే ప్రాణ నష్టం తగ్గేది

- 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలో విషాదకరం : కెటిఆర్



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంబులెన్స్‌లో మౌలిక వసతులైన ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు, ఫైర్ ఇంజిన్‌లో నీళ్లుంటే గుల్జార్ హౌజ్ అగ్నిప్రమాదంలో ప్రాణ నష్టం తగ్గేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రమాద స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన సోమవారం సందర్శించారు. అదేవిధంగా ఈ ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలను రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ సన్రైస్ విల్లాలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫైర్ బ్రిగేడ్‌కు సరైన మాస్కులు లేకపోవడంతో వాళ్లు లోపలికి వెళ్లి బాధితులను కాపాడలేకపోయారన్నారు. ప్రభుత్వం అందాల పోటీల మీద పెట్టిన శ్రద్ధ, ఇలాంటి మౌలిక సదుపాయల కల్పనపై పెడితే బాగుంటుందన్నారు. గుల్జార్ హౌస్ గురించి తెలియని వాళ్లు హైదరాబాద్, తెలంగాణలో ఎవరూ లేరన్నారు. చార్మినార్ దగ్గర 125 ఏళ్ల నుంచి ఉంటున్న అగర్వాల్ కుటుంబంలో 17 మంది చనిపోవడం హైదరాబాద్ చరిత్రలోనే విషాదకరమన్నారు. బాధిత కుటుంబసభ్యులు ఎవరినీ నిందించడం లేదని, కానీ వారు కొన్ని విషయాలు చెప్పారని అన్నారు. ఫైర్ బ్రిగేడు నీళ్లు లేకుండా వచ్చిందని, ఫైర్ బ్రిగేడ్ వాళ్లు సరైన మాస్కులు లేకుండా రావడంతో లోపలికి వెళ్లలేకపోయారన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రమాద బాధితులకు పరామర్శ

గుల్జార్ హౌస్ వద్ద అగ్ని ప్రమాదంలో మృతి చెందిన 17 మందిలో 10 మంది రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్ సన్రైస్ విల్లాలో ఉండేవారు. ఆ కుటుంబాలను కేటీఆర్ పరామర్శించారు. అగ్ని ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. సకాలంలో సహాయక చర్యలు చేపడితే కొంతమంది బతికే వారని అన్నారు. అదేవిధంగా అంబులెన్స్‌లో ఆక్సిజన్ లేకపోవడంతో కొంతమంది చనిపోయారని ఆరోపించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమ్మద్ అలీ, బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

విద్యుత్ తీగలు తగిలి రైతు మృతి

- మోటారు సైకిల్ సహా సజీవ దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెగిపడిన 11కేవీ విద్యుత్ తీగలను గమనించని ఓ రైతు అటుగా మోటారు సైకిల్‌పై పొలానికి వెళ్తున్న క్రమంలో విద్యుద్ఘాతానికి గురై మృతి చెందారు. ఈ ఘటన ఖమ్మం సత్తుపల్లి మండలం కొత్తూరు గ్రామంలో సోమవారం ఉదయం జరిగింది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌తోపాటు రైతు పూర్తిగా దగ్ధమయ్యారు.. రైతు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు గ్రామానికి చెందిన పైడిమర్ల పెద్ద మురళీధరరెడ్డి (59) రోజువారీ పనిలో భాగంగా ఉదయం ఖాతాదారులకు పాలుపోసి ఇంటికొచ్చిన అతను బైక్‌పై పొలానికి బయలుదేరారు. ఆదివారం సాయంత్రం వీచిన గాలి దుమారానికి గౌరిగూడెం సబ్‌స్టేషన్ నుంచి కొత్తూరు గ్రామానికి ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ తీగలు పడిపోయాయి. అది గమనించని మురళీధరరెడ్డి బైక్‌ను తీగలపై నుంచి పోనివ్వడంతో బండి చక్రాలకు తగిలాయి. వెంటనే అతను విద్యుద్ఘాతానికి గురై మోటారు సైకిల్‌తోపాటు పూర్తిగా కాలిపోయారు. కొంత సేపటి తరువాత అటుగా వచ్చిన మరో రైతు గమనించి పరిగెత్తుకుంటూ గ్రామంలోకి వెళ్లి గ్రామస్తులకు చెప్పాడు. గ్రామస్తులు వచ్చి మృతిచెందిన వ్యక్తి పెద్ద మురళీధరరెడ్డిగా గుర్తించారు. వెంటనే సత్తుపల్లి విద్యుత్తు శాఖ అధికారులకు సమాచారం అందించడంతో ఆ లైనుకు విద్యుత్ సరఫరా బంద్ చేశారు. అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైతులకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సత్తుపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టిఐ కమిషనర్ల నియామకాన్ని పునఃసమీక్షించాలి

- బిసిలను విస్మరిస్తే రేవంత్ ప్రభుత్వంపై యుద్ధభేరి
- జాజుల శ్రీనివాస్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమాచార హక్కు చట్టం కమిషనర్ల నియామకాన్ని పునఃసమీక్షించాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లో శ్యామ్ కుర్మ అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కుల గణన చేసి చేతులు దులుపుకుంటే సరిపోతుందా? నామినేటెడ్ పదవుల్లో తమ వాటా ఏదని ప్రశ్నించారు. బిసిలను మోసం చేయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు. 48 గంటల్లో ఆర్‌టిఐ కమిషనర్లలో బిసిలకు ప్రాధాన్యత కల్పించాలని, లేదంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధబేరి ప్రకటిస్తామని హెచ్చరించారు. రెండు కోట్ల మంది బిసిల్లో ఒక్కరు కూడా ఆర్‌టిఐ కమిషనర్లుగా ఉండే అర్హత లేదా? అని ప్రశ్నించారు. ఆరుగురు కమిషనర్లలో నలుగురు ఒసిలను నియమించి సామాజిక న్యాయాన్ని పాటించామని చెప్పటం సరికాదన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ బాగయ్య, బిసి కుల సంఘం జెఎసి కన్వీనర్ బాలరాజు,ఎలికట్టె విజయ్, జాజుల లింగంగౌడ్, వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమాచార్యకు వాగ్గేయకారుల సంగీత, నృత్య నీరాజనం

ప్రజాశక్తి కల్చరల్

అందరికీ శ్రీ హరే అంతరాత్మా...... నేల పై నిద్రించి బంటు నిద్ర ఏనుగుపై ఊరేగే రాజు నిద్ర ఒక్కటె అని సమభావాన్ని పదిహేనవ శతాబ్దం లో తన కీర్తనలో అన్నమయ్య చాటారని ప్రముఖ నాట్య గురువు పసుమర్తి శేషు బాబు అన్నారు. రవీంద్ర భారతి ప్రధాన వేదికపై భారత్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో వాగ్గేయకారులు అన్నమాచార్య 61 వ జయంతి నృత్య సంగీత భరితంగా జరిగాయి నాట్య గురువులు రమాదేవి మంజుల బాలా త్రిపుర సుందరి, సురేఖ, నవ్య, ఆశ్రిత శ్రీదేవి, సౌమ్య లేఖాశ్రీ తదితరులు శిష్యులు సుమారు రెండు వందల పైగా అన్నమయ్య కీర్తనలు నృత్య ప్రక్రియలో నర్తించారు వాయిద్య సంగీత గురువులు పద్మజ వర లక్ష్మీ ,పద్మా లత రంగ లక్ష్మి, హరి ప్రియ, పద్మజ శేఖర్ ,శారద,ఫణి జ్యోతితదితర గురువుల శిష్య బృందం కీర్తనలు సు శ్రావ్యం గా గానం చేశారు అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషు బాబు మాట్లాడుతూ అన్నమయ్య కీర్తనలు పాడుకోవడం కోసం కాగా వాటిని నృత్య ప్రక్రియగా తీసుకొని శాస్త్రీయం గా నర్తిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం విశేషం అన్నారు అన్నమయ్య కీర్తనలు కేవలం భక్తి కాకుండా వైరాగ్యాం హిత బోధన సామాజిక చింతన కూడా ఉంటుందని వివ రించారు నాట్య గురువు డాక్టర్ వనజ ఉదయ్ మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ శాస్త్రీయ సంగీతం నృత్య ప్రక్రియలు వ్యాప్తి కి చేస్తున్న కృషి విశేషం అన్నారు భారత్ వరల్డ్ రికార్డ్స్ స్థాపకుడు రమణా రావు అధ్యక్షత వహించిన వేదిక పై నటుడు జె ఎల్ శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకురాలు నాగుల పల్లి పద్మిని తదితరులు పాల్గొనగా సంస్థ స్థాపక అధ్యక్షుడు లలిత రావు స్వాగతం పలికారు.

ఒకే కుటుంబంలో ఐదుగురు అదృశ్యం

- పోలీసులు కేసు దర్యాప్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట పట్టణంలోని ఖాదర్‌పుర వీధిలో నివసించే ఓ కుటుంబంలోని ఐదుగురు అదృశ మయ్యారు. శనివారం ఉదయం నుంచి వారు కనిపించట్లేదు. ఫోన్లను ఇంట్లోనే వదిలేసి వెళ్లారు. స్థానికులు, బంధువులు ఏదైనా ఊరికి వెళ్లారని అనుకొని ఊరుకున్నారు. కానీ, రెండ్రోజులైనా వారి జాడ తెలియకపోవడంతో బంధువులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరబత్తిని బాలకిషన్‌కు అప్పులు ఉన్నాయని, తనకు డబ్బులు ఇచ్చేవారు ఇవ్వకపోవడంతో వడ్డీలు కట్టలేక ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు లేఖ రాసి పెట్టారని బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలకిషన్ తండ్రి జనార్దన్, భార్య వరలక్ష్మి, కుమారుడు శ్రావణ్, కుమార్తెలు కావ్య, శిరీష కనిపించట్లేదని తెలిపారు. అదృశ్యమైన వారి ఆచూకీ కనిపెట్టేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని ఎసిపి మధు తెలిపారు.

వైద్యారోగ్యశాఖలో నియామకాలు త్వరగా పూర్తి చేయాలి

- ఎంహెచ్ఎస్ఆర్‌బికి టియుఎంహెచ్ఇయు వినతి

అధికారికి వినతి పత్రం అందజేస్తున్న యునియన్ నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో పారామెడికల్ పోస్టుల నియామక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు) కోరింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్ కోఠిలోని మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కార్యాలయం లోని అధికారి చంద్రశేఖర్‌రావును టియుఎంహెచ్ఇయు రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ నాయకత్వంలో అభ్యర్థులు కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో దాదాపు ఒక లక్ష మంది అభ్యర్థులు పారామెడికల్ పోస్టుల కోసం పరీక్షలను రాసి ఏడు నెలలు గడిచినా మెరిట్ లిస్ట్ ఇవ్వలేదని, అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇవ్వకపోవడంతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్యారోగ్య శాఖలో ఖాళీ పోస్టుల భర్తీ చేపట్టిందని హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ కాలంలో పెండింగ్‌లో ఉన్న కొన్ని నియామకాలను కూడా పూర్తి చేశారని గుర్తుచేశారు. గతేడాది నవంబర్‌లో వివిధ రకాల పారామెడికల్ పోస్టులు భర్తీ చేపట్టారని తెలిపారు.ప్రొవిజనల్, ఫైనల్ మెరిట్ లిస్టులు విడుదల చేసి త్వరగా నియామకం చేపట్టాలని కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగులు, నిరుద్యోగులు కోరుతున్నారని తెలిపారు. 15 రోజుల్లోగా అన్ని నియామకాలను పూర్తి చేయాలనీ, లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

మే 26న ల్యాబ్ టెక్నీషియన్ల ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్

ఈ నెల 26న ల్యాబ్ టెక్నీషియన్లకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేయనున్నట్టు బోర్డు కార్యాలయంలో అధికారి చంద్రశేఖర్ రావు తెలిపారు. అదే విధంగా ఎంపిహెచ్ఎ (ఫిమేల్), ఫార్మాసిస్ట్, నర్సింగ్ ఆఫీసర్లు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ల లిస్ట్‌ను కూడా త్వరలోనే పెట్టనున్నట్టు హామీ ఇచ్చారు.

పిల్లలపైకి దూసుకెళ్లిన కారు

- బాలుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రైవింగ్ నేర్చుకునే క్రమంలో కారు అదుపు తప్పి గ్రౌండ్‌లో ఆడుకుంటున్న పిల్లలపైకి దూసుకెళ్లడంతో ఓ బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో బాలిక తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నరెగూడెం శివారులో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. శేఖర్ కుమార్తె ఏకవాణి (14), కుమారుడు మణిధర్ వర్మ (10) కుటుంబీకులతో కలిసి నరెగూడెం శివారులోని గ్రౌండ్‌లో వాకింగ్‌కు వెళ్లారు. పిల్లలు ఆడుకుంటున్న క్రమంలో నవ్య కాలనీకి చెందిన మహేశ్వరి భర్త రవిశంకర్‌తో కలిసి గ్రౌండ్‌లోడ్రైవింగ్ నేర్చుకుంటుండగా కారు అదుపు తప్పి పిల్లలపైకి దూసుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన మణిధర్ వర్మ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఏకవాణి చికిత్స పొందుతోంది. బాలుని మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పిల్లల తండ్రి శేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికవర్ హాస్పిటల్‌లో బ్రెయిన్ స్టెమ్ ట్యూమర్ శస్త్రచికిత్స సక్సెస్

- ఏడేళ్ల విదేశీ బాలుడికి పునర్జన్మ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

హైటెక్ సిటీ మెడికవర్ హాస్పిటల్ నిపుణుల బృందం అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి, ఏడేళ్ల విదేశీ చిన్నారి కి పునర్జన్మ ఇచ్చింది. ఈ చిన్నారి మెదడు స్టెమ్ ప్రాంతంలో అరుదైనా, ప్రమాదకరమైన ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. మెదడు స్టెమ్ అనేది అత్యంత సున్నితమైన ప్రాంతం, అక్కడ చేసిన తక్కువ పొరపాటుకూడా తీవ్ర న్యూరోలాజికల్ సమస్యలకు దారితీస్తుంది. ఈ క్లిష్టమైన కేసును డా. శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ న్యూరో & స్పైన్ సర్జన్ స్వీకరించి, అత్యాధునిక సాంకేతిక పరికరాలతో సహా (ఇన్‌ట్రా ఆపరేటివ్ న్యూరో మానిటరింగ్, న్యూరో మైక్రోస్కోప్,) అత్యంత జాగ్రత్తగా శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. ట్యూమర్ పూర్తిగా తొలగించారు. చిన్నారికి ఎటువంటి న్యూరాలాజికల్ సమస్యలు ఎదురవలేదు.ఈ విజయాన్ని గురించి డా. రవీందర్ రెడ్డి పరిగి, హెచ్.ఓ.డి, పిల్లల విభాగం మాట్లాడుతూ, "పిల్లల వైద్యంలో మేము కేవలం శస్త్రచికిత్స మాత్రమే కాకుండా, వారి మనోభావాలకు భరోసా కలిగించే విధంగా ఓ శ్రద్ధ గల చికిత్సా వాతావరణం కల్పిస్తాం. ఖాజా కేసు మా టీమ్ యొక్క సమిష్టి నైపుణ్యానికి ఉదాహరణ" అన్నారు.చిన్నారి ప్రస్తుతం రేడియేషన్ చికిత్స పొందుతూ త్వరితంగా కోలుకుంటున్నారు.

ఎంపిహెచ్ఎ రాత పరీక్షా ఫలితాల విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎంపిహెచ్ఎ (ఫిమేల్) రాత పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఈ మేరకు సోమవారం మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్బీ) సభ్య కార్యదర్శి ఒక ప్రకటన విడుదల చేశారు. 1,931 ఎంపిహెచ్ఎ (ఫిమేల్) పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ఈ పరీక్షను 20,600 మంది అభ్యర్థులు రాశారు. బోర్డు వెబ్‌సైట్‌లో అభ్యర్థుల మార్కులను అందుబాటులో ఉంచారు. హాల్ టికెట్, ఇతర వివరాలు ఎంటర్ చేసి మార్కులను చెక్ చేసుకోవాలని బోర్డు సూచించింది. త్వరలోనే ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేస్తామని ప్రకటించింది. ఈ పోస్టులకు సంబంధించి కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి)ని గతేడాది డిసెంబర్ 29న నిర్వహించారు. ఈ ఏడాది జనవరి 2న ప్రిలిమినరీ కీని విడుదల చేశారు. దీనిపై జనవరి 4వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించారు. వీటిని పరిశీలించిన కీ కమిటీ ప్రిలిమినరీ కీలో ఇచ్చిన సమాధానాలు సరైనవిగా అభిప్రాయపడింది. కీ కమిటీ సిఫారసుల మేరకు దానినే ఫైనల్ కీగా పరిగణనలోకి తీసుకున్నారు.